Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(4), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# వడలి రాధాకృష్ణ "మనసు మూలాల్లోకి" కథాసంపుటి – గ్రామీణజీవనం

*డాక్టర్ లంకిపల్లె జ్యోతీశ్వరనాయుడు*
*తెలుగు అధ్యాపకులు,*
*విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,*
*వెంకటగిరి, తిరుపతి జిల్లా,*
*చరవాణి: 9290881346*

దేశాభ్యున్నతికి గ్రామాలు పట్టుకొమ్మలు. ప్రశాంత వాతావరణానికి, జీవనానికి నిలయాలు గ్రామాలు. మానవ విలువలకు, బంధాలకు, ఆచార వ్యవహారాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు, ప్రేమాభిమానాలకు, గౌరవ మర్యాదలకు, ప్రకృతిలోని సహజ అందాలకు ఇలా ఎన్నెన్నో విలువలకు నెలవులు ఈ గ్రామాలు. ప్రకృతి విలువలతో, మానవ విలువలతో వర్ధిల్లుతున్న గ్రామాలు దేశానికి ఎంతటి ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయో, విలువలను ఎలా కాపాడుతున్నాయో రచయిత వడలి రాధాకృష్ణ అడుగడుగునా ప్రస్తావించారు. చీరాల, వేటపాలెం గ్రామీణ ప్రాంతంలో చదువు సంధ్యలు నేర్చిన వడలి ఆ ప్రాంతాల, పరిసరాలతోటి, ప్రకృతి అందాలతోటి, గ్రామీణ జీవన విలువలతోటి రచించిన కథాసంపుటి "మనసు మూలాల్లోకి". పద్దెనిమిది కథల ఈ సమాహారంలో దాదాపు ప్రతి కథలో గ్రామీణ జీవనం కనబడుతుంది.

ఈ కథాసంపుటంలో మొదటికథ "తొలిపొద్దుకల". ఇది గ్రామీణ జీవనానికి అద్దంపట్టే కథ. కోస్తాజిల్లాలు పచ్చదనానికి, పంటచేలకూ పెట్టింది పేరు. పచ్చని తివాచీ పరిచినట్లుండే వరిపంట పండే మాగాణి పొలాలు, కొబ్బరిచెట్లు, చెరువులు, చల్లని వాతావరణం ఇదీ కోస్తా జిల్లాలలోని పల్లెల అందం. పొద్దుటి నుండి సాయంత్రం వరకు కలుషితం లేని ఆహ్లాదకర వాతావరణంలో వ్యవసాయం చేసుకొని సాయంత్రానికి ఇంటికి చేరే రైతన్న గ్రామీణ జీవన సరళికి వెన్నెముక. అయితే ప్రపంచీకరణ ప్రభావంతో కోస్తాతీరప్రాంతాలలో పచ్చగా కళకళలాడే పంటపొలాలు కనుమరుగయిపోయి రొయ్యల కయ్యలు విస్తరించి, మధ్య దళారీలు లక్షాధికారులై ఉత్పత్తిదారులు బికారులుగా మారిపోతున్న గ్రామీణ జీవన విషాదాన్ని వడలి మనకు ఆలోచన కలిగే విధంగా రచించారు 'తొలిపొద్దులకల' కథలో.

గ్రామీణ జీవనంలో భాగమైన వ్యవసాయం పంట బాగున్నపుడు ఆ పొలాల అందం, ఉదయాన్నే నారుమడులు వేయాలనీ, వరినాటాలనీ, మడులు దున్నాలనీ, కలుపు తీయాలనీ పరుగులు తీసే గ్రామీణుల దైనందిన జీవితాన్ని చక్కగా రచించారు. పంట వేయకముందు, శుభ్రంచేసిన మాగాణిపొలం, నల్లని కారుమబ్బులు వచ్చి భూమిమీదే ఉన్నాయా అన్నట్లు ఉంటాయనీ, వరిపంట వేసిన తర్వాత నేలకి పచ్చని తివాచీ పరచినట్లు ఉంటుందనీ, వరిపంటపండి కోతకు వచ్చేసరికి బంగారు వన్నెలో భూమాతకు బంగారం చేయించి అద్దితే వచ్చే అందం వరిపంటపైరుకు ఉందని రచయిత గ్రామీణ జీవనంలో మాగాణి అందాలకు సొబగులద్దారు. అయితే వర్షం కురవక బీటలు తీసిన భూమి పగుళ్ళు రైతన్న బ్రతుకుల్లో బీటలు పడేటట్లు చేసింది. ఈ నేపథ్యంలో రైతన్న పచ్చని పంటపొలాలను

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(4), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ముందుంచుకొని కడుపునిండక బాధపడుతున్న సమయంలో అమాయకులైన గ్రామీణులను దళారీలు వచ్చి పంట పొలాలకు రొయ్యల చెరువులుగా మార్చమన్న దుష్ప్రచారం బాగా ప్రభావం చూపించిందని తెలుస్తుంది. గ్రామీణ జీవనం సాగాల్సిన తీరులో సాగడం లేదని రచయిత ఆవేదన ఈ రచనలో తెలుస్తుంది. ఇప్పుడు కులవృత్తులు లేవు. కుండలుచేసే కుమ్మరోడు లేడు. మగ్గం నేసే సాలోడులేడు. కత్తులు పట్టే కమ్మరోడు లేడు. వడ్రంగోళ్ళు అయితే సరేసరి. చివరికి గడ్డం గీయడానికి కూడా ఎవరూ మిగల్లేదు. ఎవరి గడ్డం వారు గీసుకొనే మిషన్లు వచ్చారు. తరతరాలుగా నమ్ముకొని బ్రతికిన సాంప్రదాయ వృత్తులన్నీ మాయమైనాయి. దేశానికి వెన్నెముక అని గొప్పలు చెప్పే రైతు పదానికి అర్థం మారిపోయింది.

“మనసు మూలాల్లోకి” అని కథాసంపుటికి పేరుపెట్టిన వడలి అదే పేరుతో ఒక కథ వ్రాశారు. ఈ కథలో ఇప్పుడున్న గ్రామీణ వాతావరణంకాక పూర్వపు గ్రామీణ వాతావరణం ప్రస్ఫుటమవుతుంది. జీవనయానంలో చదువు సంధ్యల కోసమో, ఉద్యోగ ఉపాధులకోసమో పుట్టి పెరిగిన పల్లెల్ని విడిచి పట్టణాలకో, పరాయి ప్రాంతాలకో వలసపోయి ఐశ్వర్యంతో తులతూగుతూ వయసుపైబడి జీవితం ఆవలి తీరానికి చేరువవుతున్న సమయంలో ఈ సుఖాలు, ఈ దుఃఖాలు సంపదలు నిజంగా ప్రశాంతతను ఇవ్వడంలేదని, పుట్టిపెరిగిన పల్లెలోని అక్కడి మనుషుల మధ్యే, ఆ ప్రకృతి ఒడిలోనే నిజమైన ప్రశాంతత లభిస్తుందని ఆ మనుషులలోని ఇంకా ఆనాటి అమాయకత్వమూ, మంచితనమూ మిగిలి ఉన్నాయని తెలుసుకోడానికి రచయిత సంధించిన గ్రామీణాస్త్రం ఈ “మనసు మూలాల్లోకి” కథ.

భారతదేశంలో అందులోనూ సంస్కృతికి పట్టుగొమ్మ అయిన ఆంధ్రదేశంలో ఓ పల్లెటూరిలో పుట్టి, డాక్టరుగా ఎదిగిన వ్యక్తి మంచి సర్జన్‌గా లండన్‌లో స్థిరపడి అక్కడి యాంత్రిక జీవితంలో తలమునకలైన జీవితపు చరమాంకంలో తను పుట్టిపెరిగిన ఊరు వస్తాడు. ఆ ఊరు విశాఖస్టీల్‌ప్లాంట్ పుణ్యమా అని కనుమరుగయిందని అతని స్నేహితుడు చెప్తాడు. అయితే ప్రశాంత వాతావరణం ఉన్న ఇంకొక గ్రామంలో ఉంటానంటాడు. ఆ గ్రామానికి వెళ్ళే తీరు రచయిత గ్రామీణ జీవనానికి అద్దం పడుతుంది.

గోస్తనీ నదిమీద బల్లకట్టు దాటాలి. ఎప్పుడో తాతగారితో చిన్నప్పుడు ‘వేంద్ర అగ్రహారం’ వెళ్ళాలంటే బల్లకట్టు దాటిన గుర్తు డాక్టర్‌కి. ఇంకా ఈ రోజుల్లో కూడా బల్లకట్టు. అదేకాదు ఊరికి అవతల మరో కాలువ. దానిమీద మరో బల్లకట్టు. కూలిపోయిన కర్రల వంతెనకు అడ్డుకొని నీటి ప్రవాహానికి అంతరాయం కల్గిస్తున్న తూటిమొక్కలు. బల్లకట్టు వింతగానూ, కొత్తగానూ ఉంటుంది డాక్టరుకి. బల్లకట్టు గెంటుతున్న గుర్రంతాతకి డబ్బులు ఇస్తాడు డాక్టర్. అక్కడి రోడ్లు మట్టివి. కొంచెం గాలికే ఎగిరిపోతుంది. అక్కడక్కడ పరిచిన ఎర్రకంకర. నల్లటి మట్టికి భిన్నంగా ఉంది. రెండు బజారులు తిరిగిన డాక్టరు అతని స్నేహితుడు ఆ ఊరి ప్రసిడెంటుని కలుస్తాడు. ఈ ఊరు ఇంతరకేనా అనుకుంటుంటే, వేంద్ర గ్రామస్తుడు విని అవునండీ...రెండువైపులా వేంద్రను కావలించుకున్న గోస్తనీ నది...అంటూ, ఇటు బల్లకట్టూ, అతిపురాతనమైన రామలింగేశ్వరుడు, గోపాలస్వామి దేవాలయాలు, వందేళ్ళనాటి అతిపెద్ద మర్రిచెట్టు నిజం చెప్పాలంటే వేంద్రను తలచుకుంటే వేదం గుర్తుకు వస్తుంది అని ఆ గ్రామం గురించి చెప్తున్న యువకుడు ముస్లిం. ముస్లిం యువకుడు వేదం గురించి ఉద్వేగంగా చెప్పడం, డాక్టర్‌కి గ్రామీణ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(4), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

జీవనంలో ఉన్న మత సామరస్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. పట్టణాల్లోలేని సంస్కృతి పల్లెల్లో ఉందనడానికి ఇలాంటివే మచ్చుతునకలు.

ఊరి మధ్యన పెద్దగా ఉన్న మర్రిచెట్టు వంద సంవత్సరాలు పైబడి శాఖోపశాఖల్ని, ఊడల్ని విస్తరించుకొని ఉంది. దాని నీడ మటుకు ఎంతో దూరం విస్తరించి ఉంది. ప్రతి సంవత్సరం ఆగష్టు నెలలో కాల్వలు పొంగి ప్రవహించడం అక్కడ సర్వసాధారణం. ఇతర గ్రామాలు, పక్క పట్టణాలు ముంపుకు గురవుతుంటాయి. వేంద్రమటుకు ఎప్పుడూ మునిగిపోలేదు. ప్రపంచం మొత్తం కరువుతో అల్లాడినా వేంద్రమటుకు ఎప్పుడూ సస్యశ్యామలమే. ఇరువైపుల నుండి కావలించుకొన్న నదులు రెండూ ఎండిపోవు. ఊరి పచ్చదనాన్ని వాడనివ్వవు. ఇలా 'మనసు మూలాల్లోకి' కథలో గ్రామీణ వాతావరణాన్ని జీవనాన్ని ఎంతో ముచ్చట గొలిపే విధంగా రచయిత రచించారు. పాఠకులకు కూడా ఆ ఊరు వెళ్ళాలి అనిపించేటట్లు రచన చేశారు.

వదలి రాధాకృష్ణ కథల్లో గ్రామీణజీవనం అన్ని రకాలుగా పోషింపబడింది. తండ్రి హయాంలో పుట్టిపెరిగిన ఊరు వదలి పట్నవాసాలకు అలవాటుపడ్డవారు కోకొల్లలు. అయితే అలా వెళ్ళిన వారిలో పుట్టిపెరిగిన పల్లెటూరిని మరచిపోయేవారు కొద్దిమంది మాత్రమే. గ్రామాల్లో ఉన్న ఆత్మీయతకు, ఆహ్లాదానికి, పులకింతకు గురికాకుండా ఉండరు అంటే అతిశయం కాదు. రాధాకృష్ణ 'మనసు మూలాల్లోకి' కథాసంపుటిలోని 'పగటి చంద్రుడు' కథలో 'అమళ్ళదిన్నె' అనే గ్రామం యొక్క అందాలను అక్కడి జనుల మనసును మనకు తెలియజేశారు.

ఈ కథలో చదువు, ఉద్యోగం పేరిట అమళ్ళదిన్నె గ్రామాన్ని వదలి పట్నానికి వెళ్తాడు ఒకతను. అతని తండ్రి మరణం మరల ఆ ఊరు రప్పిస్తుంది. అప్పుడు కూడా తండ్రి కర్మాది కార్యక్రమాలు పూర్తిచేసుకొని, అక్కడి ఆస్తులు అమ్ముకొని వెళ్తాడు. పట్నంలో అతని ఇంట్లో ఎన్ని కార్యక్రమాలు, ఫంక్షన్లు జరిగినా తను జన్మించిన ఊరిలోని మనుషులను మాత్రం పిలువడు. కాని తన ఇల్లు, పొలము కొనుక్కున్న ఒకప్పటి తమ పాలేరు పోశయ్య మాత్రం తన కూతురి పెళ్ళికి ఆహ్వానిస్తాడు తన ఆసామిని. ఇక్కడ వదలివారు పట్నం మనసులకు, గ్రామీణ జనుల మనసులకు వ్యత్యాసం చెప్పడం జరిగింది.

గ్రామీణ జీవనంలో ముఖ్యంగా పండుగలకు, పండుగల ఆచారాలకు పెద్దపీట వేస్తారు గ్రామస్థులు. ఏ పండుగను ఏ విధంగా జరిపే ఆచారం పెద్దలు నేర్పించారో ఆ పద్ధతిలోనే సాగిపోయే విధంగా ఇప్పటి తరాలవారు కూడా సాంప్రదాయాలను కాపాడుకుంటుంటారు. 'అమళ్ళదిన్నె' గ్రామంలో దసరా పండుగనాడు 'శమీపూజ'కు బాగా విశిష్టత ఉంది. 'పోశయ్య' తన కామందుని దసరాకు శమీపూజ చేస్తారు ఉండండయ్య అని బ్రతిమాలేసరికి అతని అభిమానానికి బద్ధుడై ఉంటాడు.

ఊరంతా దసరా పండుగ సందడి నెలకొని ఉంది. విఖసన స్వామి వారి గుడిలో జమ్మిచెట్టుక్రింద జమ్మికొమ్మకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు పంతులుగారు. నారాయణాచార్యులుగారి కొడుకు గోపాలాచార్యులుగారు ఇప్పుడు పూజారి. బేసిని నిండా బియ్యం నింపుకొని పూజాసామగ్రి, దక్షిణలతో కావల్సినవన్నీ ఆచార్యుల గారికి అందజేసింది పోశయ్య భార్య అచ్చమ్మ. శమీపూజ జరిగేటపుడు

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(4), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఆచార్యులగారి మంత్రాలతో అక్కడి వాతావరణం ఆధ్యాత్మికంగా మారిపోతుంది. ఆచార్యులవారు సంకల్పం చదివే సమయంలో తన పేరు చదవటం ఒకింత సంభ్రమానికి గురిచేస్తుంది. అవునండీ! ఈ గుడి మీ పెద్దలు కట్టించినది. అందుకని ప్రతి సంవత్సరం శమీపూజ మీ వంశస్థుల పేరుమీదుగానే జరుపుతాము అని ఆ ఊరువారు చెప్పడంతో అక్కడి మానవీయ విలువలు, ఆచారాలు, సాంస్కృతిక వైభవాలు అన్నీ గోచరిస్తాయి. సాంస్కృతిక వైభవాన్ని, పుట్టెడు సంతోషాన్నిచ్చే పుడమిని...మట్టి వాసనలను తెగనమ్మి కానిచోట బ్రతికే తీరుకూ గ్రామీణ జీవనంలోని సాంస్కృతిక ఆచార విలువలకూ తేడా స్పష్టమయ్యే విధంగా ఈ కథారచన చేశారు వడలి రాధాకృష్ణ.

ఈ విధంగా 'మనసు మూలాల్లోకి' కథాసంపుటిలోని కథల్లో గ్రామీణ జీవన విధానాన్ని వడలి పాఠకుల హృదయంలో గ్రామీణజీవన విలువ పెరిగే విధంగా రచించారు. ఒక దృక్పథమే కాకుండా అన్ని జీవన విలువలు ఈ కథల్లో కనిపిస్తాయి. గ్రామీణ జీవనమంటే అక్కడి ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా బ్రతుకు బండి సాగిపోయేది కాదనీ...వారి జీవనంలో కూడా ఒడిదుడుకులు ఉంటాయని కూడా వడలి కొన్ని కథల్లో చెప్పారు. అమాయక ప్రజల రెక్కల కష్టాలను తమతమ ఖజానాల్లో నింపుకొనే దగాకోరు దళారీలను, గ్రామీణ విలువలు తెలియక పల్లెల్ని పరిహసించే పామరులను గూర్చి పల్లెల్లోని పాఠకులు చదివి అర్థం చేసుకొనే విధంగా రచన చేశారు. ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ వంటివి గ్రామాల ఉనికిని ఎలా రూపుమాపుతున్నాయో బలంగా చెప్పిన కథలు ఈ సంపుటి కథలు. ఆయనకు గ్రామీణ వాతావరణం మీద ఉన్న అభిమానము, ఆసక్తి, ఆదరణ అన్ని విషయాలు మనకు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఈయన రచనల ద్వారా నేటి యువత గ్రామీణ జీవన విలువలు తెలుసుకొని గౌరవభావం కలిగేలా వడలి రచనలు ఉన్నాయి.

### ఆధార గ్రంథాలు

1. 'మనసు మూలాల్లోకి' కథాసంపుటి – వడలి రాధాకృష్ణ
2. తెలుగుకథ – తెలుగుదనం (మహతిసమీక్ష – వ్యాససంకలనం) యువభారతి ప్రచురణ, హైదరాబాద్, 1972.